# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-09-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రైతులకు సకాలంలో యూరియా, ఎరువులు సరఫరా చేయడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుంది.**
3. **విద్యావకాశాలు, నీటి ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా పాలమూరును మరింత అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
4. **ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేలా పోలవరం పనులు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**
5. **తెలుగు రాష్ట్రాలకు కొత్త రైళ్లను కేటాయించాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను ఉభయ రాష్ట్రాల పార్లమెంట్ సభ్యులు కోరారు.**

==========================

రైతులకు సకాలంలో యూరియా, ఎరువులు సరఫరా చేయడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఎరువుల లభ్యతపై గత సాయంత్రం పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎరువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6.65లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్...33 సెకన్లు

--------------------------

విద్యావకాశాలు, నీటి ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా పాలమూరును మరింత అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని వేముల గ్రామంలో ఎస్‌జీడీ – కార్నింగ్ టెక్నాలజీస్ సంస్థ నిర్మించిన నూతన యూనిట్‌ను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. రాబోయే రోజుల్లో మహబూబ్ నగర్ జిల్లాకు నూతన పరిశ్రమలు, ప్రాజెక్టులు రానున్నాయని వీటి ద్వారా స్థానిక యువత అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొంటూ,

వాయిస్ 23 సెకన్లు

-------------------------

సాధారణవస్తువులపై కేంద్ర ప్రభుత్వం వస్తు–సేవల పన్ను–జీఎస్టీని తగ్గించిందని ఈ నెల 22 నుండి కొత్త రేట్లు వర్తిస్తాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. నిర్మలా సీతారామన్ అధ్యక్షతన నిన్న సమావేశమైన జీఎస్టీ పాలకమండలి పలు నిర్ణయాలను తీసుకుంది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. వ్యక్తిగత వస్తువులపై పన్ను తగ్గించడం ద్వారా దేశీయంగా కొనుగోళ్ళు పెరుగుతాయని తెలిపారు. అన్ని నిర్ణయాలను ఏకాభిప్రాయంతో తీసుకున్నామని తెలిపారు.

కాగా.. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ ప్రజల జీవితాలను మెరుగుపరచడంతోపాటు ఆర్థిక రంగాన్ని బలోపేతం చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలు గొప్ప నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి నిన్న సమీక్షించారు. విశాఖ, విజయవాడ, అమరావతి, తిరుపతి, కర్నూలు వంటి ప్రాంతాల్లో పర్యాటక కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్వదేశ్ దర్శన్ పథకం కింద బొర్రా గుహలు, అరకు, లంబసింగిలో పనులు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు.

-------------------------

ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేలా పోలవరం ప్రధాన కాలువ పనులు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పోలవరం ప్రాజెక్ట్, పోలవరం పునరావాస పనులపై జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ వర్షాకాలం, భారీ వరదల్లోనూ పోలవరం పనులు జరుగుతుండటంపై విదేశీ నిపుణుల బృందం సంతృప్తి వ్యక్తం చేసిందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారమే డయాఫ్రంవాల్ నిర్మాణం జరుగుతోందని ఇప్పటివరకు 42 శాతం పూర్తైందన్నారు. పోలవరం ఎడమ, కుడి కాలువల నిర్మాణాలను 2026 జూన్ కల్లా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సెప్టెంబర్ నెలాఖరుకు నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో పొగాకు, ప్రత్తి కొనుగోళ్లపై మంత్రి నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రైతు ప్రయోజనం దృష్ట్యా పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

-------------------------

తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు కొత్త రైళ్లను కేటాయించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను ఉభయ రాష్ట్రాల పార్లమెంట్ సభ్యులు కోరారు. హైదరాబాద్‌లోని రైలు నిలయంలో జోనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ–జడ్ఆర్‌యూసీసీ 76వ సమావేశం నిన్న జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, హరీశ్ బాలయోగి, తెలంగాణా పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, డీకే అరుణతో పాటు పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్లలో లిఫ్టులు, ఎస్కలేటర్ల సంఖ్య పెంచాలని.. పలు స్టేషన్లలో రైళ్లకు హాల్ట్‌లు ఇవ్వాలని వారు కోరారు.

---------------------------

తెలంగాణలో మేడారం జాతరకు రాష్ట్ర ప్రభుత్వం 150 కోట్ల రూపాయలతో ఏర్పాట్లు చేస్తోందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మేడారంలో భక్తుల సందర్శనార్థం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలు ఒకే వరుస క్రమంలో ఉండేలా ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఆదివాసీ సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని మేడారం పరిసరాల్ని తీర్చిదిద్దాలన్నారు. జాతరకు దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ మైనారిటీల విద్యాభివృద్ధి కేంద్రం–సీఈడీఎం ద్వారా ఉచిత శిక్షణ తీసుకున్న 152 మంది డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు సాధించినట్లు మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఈడీఎం సంస్థను మరింత బలోపేతం చేయనున్నామన్నారు. కేంద్ర, రాష్ట్రస్థాయిలో జరిగే పలు పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థులకు కూడా సీఈడీఎం ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు గ్రామీణ మండలం తురకపాలెంలో విష జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో రాష్ట్ర వైద్య విద్యా శాఖ సంచాలకులు డాక్టర్ రఘునందన్ అధ్వర్యంలోని ప్రత్యేక బృందం నిన్న ఆ ప్రాంతంలో పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామ పరిసరాలను పరిశీలించి, గ్రామస్థులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ,

వాయిస్ ..32 సెకన్లు

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఉత్తర ఒడిషా తీర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..22 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ మూడురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

అంతరించిపోతున్న వన్యప్రాణులను, పశుపక్ష్యాదులను పెంపొందించి.. వాటి పరిరక్షణపట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు జాతీయ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వన్యప్రాణులను కాపాడే విషయంలో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమం జరుగుతోంది. వన్యప్రాణుల ఎదుగుదలకు తగిన వాతావరణం కల్పించే విషయంలో కృషి చేసేలా ప్రజలను ప్రోత్సహించడానికి సెప్టెంబర్ 4వ తేదీని జాతీయ వన్య ప్రాణుల పరిరక్షణ దినంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

======================